# వరంగల్ వాయిస్

www.warangalvoice.net
Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 152 | గురువారం | 14 డిసెంబర్ 2023 | పేజీలు : 06 | వెల రూ. 5




2లో

## సేవా కార్యక్రమాలు అభినందనీయం

మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నరహరి
పరికిపండ్ల వారి నిశ్చితార్థానికి హాజరు



2లో

## పనుల్లో వేగం పెంచండి

కలెక్టర్ ప్రావీణ్య | అధికారులకు దిశానిర్దేశం



2లో..

## మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్క

హాజరైన ప్రముఖులు



6లో

## బండ్ సుందరీకరణకు ఎందుకు ఆలస్యం

గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా
జనవరిలోగా పూర్తి చేయాలంటూ ఆదేశం




# నో పోస్టుమార్టం

వివరాలు 2లో..

- ఫలితాలపై స్పందించని బీఆర్ఎస్ నేతలు
- రెండు వారాలైనా నియోజకవర్గంలో అడుగు పెట్టని తాజా మాజీలు
- దిక్కులేని వారిగా మారుతున్న కార్యకర్తలు
- పక్కచూపులు చూస్తున్న పార్టీ శ్రేణులు
- స్థానిక సంస్థలు, లోక్ సభ ఎన్నికలపై చూపనున్న ప్రభావం

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి 12 రోజులు కావొస్తున్నా ఓటమికి గల కారణాలపై బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇంతవరకు సమీక్షించనేలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాల్లో 10 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు అపజయం పాలయ్యారు. ఓటమి ఎరుగని నేతలు సైతం కాంగ్రెస్ గాలికి అడ్రస్ లేకుండా పోయారు. అయితే ఫలితాలు వెలువడిన కొద్ది రోజుల వ్యవధిలోనే గెలుపోటములపై సమీక్షించాల్సిన పార్టీ నేతలు నియోజకవర్గాలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఎన్నికల్లో పార్టీకి ఎదురైన పరిస్థితి, అందుకు కారణాలను విశ్లేషించుకుని త్వరలోనే జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు లోక్ సభ ఎన్నికలకు సమాయత్తం కావాల్సిన బీఆర్ ఎస్ నేతలు అలాంటి ప్రయత్నమే ఇప్పటి వరకు చేయకపోవడంతో కేడర్ లో నిరుత్సాహం నెలకొంది. పది సంవత్సరాలపాటు రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిన తాజా మాజీలు నియోజకవర్గంపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పార్టీ శ్రేణులు పక్క చూపులు చూస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్



# నో పోస్టుమార్టం

**ఫలితాలపై స్పందించని బీఆర్ఎస్ నేతలు**

**రెండు వారాలైనా నియోజకవర్గంలో అడుగు పెట్టని తాజా మాజీలు**

**దిక్కులేని వారిగా మారుతున్న కార్యకర్తలు**

**పక్కచూపులు చూస్తున్న పార్టీ శ్రేణులు**

**స్థానిక సంస్థలు, లోక్ సభ ఎన్నికలపై చూపనున్న ప్రభావం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో బీఆర్ ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఆ పార్టీ ముఖ్య నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ సమావేశం నిర్వహించినా మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అంటూ ప్రకటించారు. తెలంగాణ తెచ్చిన బీఆర్ ఎస్ వెంటే ప్రజలున్నారంటూ ఊదరగొట్టారు. అయితే ఆ స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో బీఆర్ ఎస్ నేతల కళలు కల్లలుగా మారాయి. కనివినీ ఎరుగని విధంగా అపజయం పాలయ్యారు. కాకలు తీరిన నాయకులు సైతం కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన ప్రవేశించిన వారి చేతిలో ఘోర పరాజయం చవిచూశారు. దీంతో ఆ పార్టీ అధికారం కోల్పోవాల్సి వచ్చింది. స్థానికంగాను, రాష్ట్రంలోనూ బీఆర్ ఎస్ అధికారంలో లేకపోవడంతో పార్టీలోని వివిధ స్థాయిల్లో నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి.



### సమీక్షలేవీ..

గతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజుల వ్యవధిలోనే పార్టీ ముఖ్య క్యాడర్ తో సమీక్ష నిర్వహించి అపజయానికి గల కారణాలపై పోస్టు మార్టం నిర్వహించేవారు. ఆ సంప్రదాయానికి బీఆర్ ఎస్ పార్టీ నేతలు తిదోలకాలు పలుకడంపై పార్టీ శ్రేణులు పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గాలు మినహా మిగిలిన 10 నియోజకవర్గాల్లో బీఆర్ ఎస్ పార్టీ నేతలు పరాజయం పాలయ్యారు. అన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీ ఇచ్చినప్పటికీ వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో మాత్రం బీఆర్ ఎస్ మూడో స్థానానికే పరిమితమైంది. అయితే ఈ ఫలితాలు రావడానికి కారణాలు ఏమిటన్న దానిపై అభ్యర్థుల అభిప్రాయాలు తెలుసుకోకపోవడం ఏమిటన్న ప్రశ్నలు ముందుకొస్తున్నాయి.

### ఎన్నికలపై ప్రభావం..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పోస్టుమార్టం నిర్వహించడం ద్వారా పార్టీ ఏయే ప్రాంతాల్లో బలహీనంగా ఉంది..అక్కడ చేపట్టిన దిద్దుబాటు చర్యలపై అవగాహన ఏర్పడుతుంది. తద్వారా త్వరలో జరుగనున్న స్థానిక సంస్థలు, లోక్ సభ ఎన్నికల్లో అలాంటి తప్పిదాలు జరుగకుండా చర్యలు చేపట్టే అవకాశం లభిస్తుంది. అయితే గత పాలకులు దిద్దుబాటు చర్యలకు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో దీని ప్రాభావం త్వరలో జరుగనున్న ఎన్నికలపై పడే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

### పార్టీ శ్రేణుల పక్క చూపులు..

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మొత్తం 12 నియోజకవర్గాల్లో బీఆర్ ఎస్ పార్టీ పోటీ చేయగా కేవలం రెండు నియోజకవర్గాల్లో మాత్రమే విజయం సాధించారు. మిగిలిన 10 నియోజకవర్గాల్లో పరాజయం చెందారు. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామంటూ ప్రకటన చేసిన తాజా మాజీలు ఇప్పటివరకు నియోజకవర్గంలో అడుగు పెట్టలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత కొంత కాలంగా తాజా మాజీలు హైదరాబాద్ కే పరిమితమయ్యారన్న విమర్శలొస్తున్నాయి. కనీసం పార్టీ కార్యకర్తలతో కూడా టచ్ లోకి రావడంలేదన్న ప్రచారం సాగుతోంది. దీంతో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల విజయమే లక్ష్యంగా కృషి చేసిన ఎంతో మంది కార్యకర్తల పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. దిక్కులేని పక్షులుగా మారిన కొంతమంది బీఆర్ ఎస్ పార్టీ క్యాడర్ పక్క చూపులు చూస్తున్నారు.

# సేవా కార్యక్రమాలు అభినందనీయం

**మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నరహరి**

**పరికిపండ్ల వారి నిశ్చితార్థానికి హాజరు**

**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట :** రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు-సుమలతల కుమార్తె అభిజ్ఞ, కోనసీమ జిల్లా రావులపాలెం వాస్తవ్యులు చప్పిడి వరప్రసాదరావు-సత్యవేణుల కుమారుడు లక్ష్మీ గణపతితో గురువారం హరిత హోటల్ లో జరిగిన నిశ్చితార్థ కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నరహరి హాజరై ఆశీర్వదించారు. నిశ్చితార్థ కార్యక్రమం సందర్భంగా ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల వద్ద ఉదయం ఉచిత అల్పాహార వితరణ, మధ్యాహ్నం అతిథి వికలాంగుల ఆశ్రమంలో పండ్ల పంపిణీ, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం లాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని నరహరి అన్నారు. భవిష్యత్తులో పదిమందికి ఉపాధి కల్పించే విధంగా స్టార్ట్ అప్ కంపెనీని ఏర్పాటు చేసి యువతకు మార్గదర్శకంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ అనిల్ చందర్ రావు, కమిటీ సభ్యులు పరికిపండ్ల అశోక్, సుధాకర్, సీనియర్ జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవామూర్తి, డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, వరప్రసాద్ రెడ్డి, గాజుల సంపత్, శంకర్ లింగం, సమ్మయ్య, సత్య రాజు తదితరులు హాజరై నూతన జంటకు అభినందనలు తెలిపారు.

# మద్య విమోచన ప్రచార కమిటీని పునరుద్ధరించండి

**ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లికి వినతి**



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** రాష్ట్రంలో మద్య విమోచన ప్రచార కమిటీలను పునరుద్ధరించాలని మాజీ డైరెక్టర్ దాసి రాందేవ్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టడం ద్వారా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించవచ్చన్న ఉద్దేశంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మద్య విమోచన ప్రచార కమిటీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కల్తీ మద్యం, గుడుంబా, బెల్టు షాపులపై ఈ కమిటీ ఎక్కవగా ఫోకస్ చేసేదని, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మద్య వయసులోనే వితంతువులుగా మారుతున్న వారి సంఖ్య భారీగా తగ్గిందన్నారు. అదే విధంగా నరాల బలహీనతలు, కాలేయ సమస్యలు లేకుండా పోయాయని వివరించారు. అదే తరహాలో కొత్తగా తెలంగాణ కమిటీని ఏర్పాటు చేయాలని రాందేవ్ కోరారు.

# పనుల్లో వేగం పెంచండి

**కలెక్టర్ ప్రావీణ్య , అధికారులకు దిశానిర్దేశం**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సముదాయ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్ అజాం జాహి మిల్ గ్రౌండ్స్ లో నిర్మిస్తున్న జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పనుల పురోగతికి పలు సూచనలు చేశారు. మ్యాప్ ను పరిశీలించి దాని ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. రూ.80 కోట్లతో చేపట్టిన కలెక్టరేట్ నిర్మాణ పనులు లెంట్ లెవెల్ కు చేరుకున్నాయన్నారు. అనంతరం రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మించే ప్రాంతాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ తో ఆర్ అండ్ బీ ఎస్సీ నాగేందర్ రావు, ఈఈ జితేందర్ రెడ్డి, డీఈ రాజు, ఏఈ శ్రీకాంత్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోడౌన్ నిర్మాణ ప్రగతి పరిశీలన..

గీసుకొండ మండలం కొనై మాకుల గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణించిన ఈవీఎం గోడౌన్ భవనాన్ని కలెక్టర్ పి.ప్రావీణ్య పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు పూర్తిచేసుకుని ముగింపు దశకు చేరుకున్నదని, ఫినిషింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

# మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీతక్క

**హాజరైన ప్రముఖులు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా దనసరి అనసూయ సీతక్క గురువారం బాధ్యతలు స్వీకరించారు. సెక్రటేరియట్ లో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ నా ప్రతి అడుగు అభివృద్ధి వైపు ఉంటుందన్నారు. నన్ను ఆదరించి ఆశీర్వదించిన ములుగు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించారు. సమ్మక్క సారలమ్మ దీవెనలతో రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. నన్ను అక్కున చేర్చుకున్న ములుగు ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు దక్కిందని సీతక్క అన్నారు.

# డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

## ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకుడు హకీం నవీద్



**వరంగల్ వాయిస్, కేయూ :** నూతనంగా కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యను అభ్యసిస్తున్నటువంటి విద్యార్థులకు రెండు సెమిస్టర్లకు 50 శాతం సబ్జెక్టులు పాస్ కావాలని పెట్టిన నిబంధనలను విరమించుకోవాలని ఏఐఎస్ బీ రాష్ట్ర నాయకుడు హకీం నవీద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పాలకవర్గం అనాలోచిత విధానాల వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో నెట్టి వేసే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీసీ ఈ అంశంపై పునరాలోచించి విద్యార్థుల భవిష్యత్తు దృశ్య డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమాలను ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు.

# పోలింగ్ బూత్‌లు, వాటి మౌలిక సౌకర్యాలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, పరకాల :** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని పరకాల నియోజకవర్గం పరిధిలోని ఎలక్షన్ పోలింగ్ బూత్‌లు, వాటి మౌలిక సౌకర్యాలు తదితర అంశాలపై గురువారం పరకాల ఆర్డీఓ ఆఫీసులో అన్ని రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన పరకాల పట్టణ అధ్యక్షుడు డాక్టర్.మడికొండ శ్రీను మాదిగ పాల్గొన్నారు. పరకాల పట్టణంలోని కొన్ని పోలింగ్ బూత్ లలో కనీస సౌకర్యాలు లేనందున వాటిని అనుకూలమైన చోటకు మార్చాలని కోరారు. అలాగే వివిధ పోలింగ్ బూత్ లలో ఉన్న కుటుంబ సభ్యుల ఓట్లు అన్ని ఒకేచోటకు 8ఫారం ద్వారా మార్పిడి చేయాలని కోరారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీఓ శ్రీనివాస్, పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూర్, సంగెం మండలాల తహసీల్దార్లు నాయిని జగన్ మోహన్ రెడ్డి, సత్యనారాయణ, జ్యోతిలత, సురేష్, రాజకుమార్, ఎలక్షన్ ఇంచార్జి ఆర్ఐ విజయలక్ష్మి, ఆర్డీఓ ఆఫీస్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పాఠశాలల పనితీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో భాగంగా రఘునాథపల్లి మండలంలోని ఏర్రగడ్డతండా పాఠశాలను జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మానిటరింగ్ ఆఫీసర్ పర్యవేక్షణ సమయంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను చదవడం, రాయడం వంటి అంశాలను సబ్జెక్టుల వారీగా పరిశీలించారు. పాఠశాలలో అమలయ్యే ఎఫ్ ఆర్ఎస్ (విద్యార్థుల అన్ లైన్ హాజరు) పరీక్ష పత్రాల సరళి, ఎఫ్ ఎల్ఎన్ (అభ్యాసన దీపికలు) వర్క్ బుక్స్, మధ్యాహ్న భోజనం, వంటి కార్యక్రమాల రికార్డులు పరిశీలించడం జరిగింది. మానిటరింగ్ ఆఫీసర్ పర్యవేక్షణ సమయంలోనే బడి బయటి విద్యార్థుల సర్వేలో ఉన్న సీఆర్పీఎఫ్, ఐఈఆర్ పీఎస్ లకు 6-19 సంవత్సరాల విద్యార్థులు ఎవరూ విద్యకు దూరం కాకుండా చూసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాఠశాలకు ఎక్కువ రోజులు గైర్హాజరైన వారిని గుర్తించి పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేయాలని తగు సలహాలు సూచనలు చేశారు.

# నూతన ఎమ్మెల్యేలకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభకు ఎన్నికైన శాసనసభ్యులు వరంగల్ పశ్చిమ నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నాగరాజు, పరకాల రేవూరి ప్రకాష్ రెడ్డి, నర్సంపేట దొంతి మాధవరెడ్డిలను సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి విద్యారణ్యపురి గోపాలపురం హనుమకొండ జిల్లా ఉభయ స్వచ్ఛంద సంస్థల పక్షాన మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం 2007, నియమావళి 2011, వినియోగదారుల రక్షణ చట్టం 2019 అమలులో సహకరించాలని కోరారు. మా లక్ష్యం వృద్ధులను గౌరవిద్దాం, వినియోగదారుడే రారాజు అను నినాదాలతో ముందుకు సాగుతున్న తమ ఉద్యమానికి స్వచ్ఛంద సంస్థలకు సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి వర్గం కోరి అన్నారు. సానుకూలంగా స్పందించిన శాసనసభ్యులు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దామెర నర్సయ్య, ఉపాధ్యక్షుడు నాగులగాం నరసయ్య, సీడబ్ల్యూ సీ మెంబర్ కజాంపురం దామోదర్, కార్యదర్శి తేరాల యుగంధర్, గోకారపు రాజేందర్, గంటి సాంబయ్య, గంగారపు యాదగిరి, పిట్టల సాంబయ్య, వర్ధిల్లి మల్హాల్ రావు, రాజమౌళి,వెల్దండి శ్రీనివాస్, తేరాల యుగంధర్, డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, సంస్థ ప్రతినిధులు పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# బీసీ రిజర్వేషన్‌పై తీర్మానం చేయాలి

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాలలోనే బీసీలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్ పై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని బీసీ హక్కులసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాములవెంకట్రాములు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న బీసీల ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలలోనే బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని, దేశ జన గణనలో బీసీ కులగణనను చేపట్టాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో నిధులను కేటాయించి బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్స్ పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని ఆయన కేంద్ర ప్రభుత్వాన్నిహెచ్చరించారు. రాష్ట్రంలోఅధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన బీసీ డిక్లరేషన్ ను అమలు పరిచేందుకు రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టాలన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్ తగ్గించి తీరని అన్యాయం చేసిందని, ఫలితంగా బీసీల ఆగ్రహానికి గురైందన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ లో స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చిన మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచిన తరువాతనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని వెంకట్రాములు కోరారు. ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను చిత్తశుద్ధితో అమలు జరుపగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# పరకాల ఎమ్మెల్యే రేవూరికి సత్కారం



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల శాసన సభ్యుడిగా నూతనంగా గెలుపొందిన రేవూరి ప్రకాష్ రెడ్డిని బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల, నడికూడ మండలాల ఉపాధి హామీ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ నాపై అపూర్వమైన నమ్మకంతో నన్ను గెలిపించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, అందరం కలిసికట్టుగా పనిచేసి పరకాల నియోజక వర్గం అభివృద్ధి పరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల టెక్నికల్ అసిస్టెంట్స్ కుసుమ, రాధిక, కంప్యూటర్ ఆపరేటర్స్ రఘుపతి, దర్శన్, తెలంగాణ రాష్ట్ర ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్షుడు మేకల రవి, పరకాల మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షురాలు గడ్డం కోమల, జిల్లా ఉపాధ్యక్షుడు సిలువేరు బాబు, రెండు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్ లు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థలు, ఎంపీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు గెలవాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** కోడూరు గ్రామంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలు, రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీ ఎలక్షన్ల లో మెజార్టీ స్థానాలు సాధించాలని, అందుకుగాను కార్యకర్తలు కృషి చేయవలసి ఉంటుందని తెలిపారు. అలాగే ఈరోజు బీఆర్ఎస్ పార్టీ నుంచి 10 కుటుంబాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత తొమ్మిదేళ్ల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇస్తానన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, రైతులకు రుణమాఫీ లాంటివి చేయకపోగా 100రోజుల్లో చేస్తానన్న పథకాలను బీఆర్ఎస్ నాయకులు వారం రోజులకే తమ అధికార దాహాన్ని జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఎలక్షన్ల ముందే 100రోజులలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పడం జరిగిందని, కేవలం రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన వారందరికీ పది లక్షల ఆరోగ్య భీమా పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, మేకల నరేందర్, బానోత్ భిక్షపతి నాయక్, అరవింద్ రెడ్డి, కావటి భాస్కర్ యాదవ్, నీలం యువరాజ్, సట్ల యాకమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు అంజయ్య, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
గురువారం 14, డిసెంబర్ 2023
www.warangalvoice.net


# మంత్రులను కలిసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బుధవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డిలను వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.









## రైతు బంధుకు కొత్త రైతులు దరఖాస్తు చేసుకోండి



**వరంగల్ వాయిస్, మల్లూర్ :** కొత్తగా పట్టాదార్ పాస్ బుక్ వచ్చి ఇప్పటివరకు రైతు బంధు పొందని కొత్త రైతులు రైతు బంధు కోసం సంబంధిత క్లస్టర్ ఏఈవో వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఏవో అత్తే సుధాకర్ కోరారు. కొత్త రైతులు దరఖాస్తు ఫారం, పట్టాదార్ పాస్ బుక్ ,ఆధార్ కార్డు,బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాఫీలతో ఏఈవోని సంప్రదించి రైతు బంధు పొందవచ్చు, కాబట్టి రైతులు ఈ అవకాశాన్ని సదివినియోగం చేసుకోవాలని కోరారు. ఇంతకు ముందు రైతు బంధు పొందిన రైతులు దరఖాస్తు ఇవ్వాల్సిన పని లేదని, కొత్త రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఏవో రైతులకు సూచించారు.

## హరిహర అయ్యప్ప ఆలయంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని హరిహర అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ గురు స్వామి మాణిక్యం బాపూరావు ప్రారంభించారు. ఆలయ నిర్మాణ కర్త పరకాల ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ చే నిర్మించిన అయ్యప్ప ఆలయంలో ప్రతి సంవత్సరం నిత్యాన్నదానం జరుగుతూనే ఉంటుంది. అందులో భాగంగా గురువారం నుంచి జనవరి 6 వరకు నిత్యాన్నదానం జరుగుతుందని ఆలయ నిర్వహణ కమిటీ తెలిపారు. అన్నదానంలో పాల్గొనేవారు ఆలయ క కమిటీని సంప్రదించగలరని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు దేశపతి, రాజు, గోపీనాథ్ యాదగిరి, ఏదుల రమేష్, సిద్ధం శెట్టి రాజు, భద్రయ్య, విజయ్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కందగట్ల బొంది లింగం ఇటీవల మృతి చెందగా గురువారం నిర్వహించిన దశదినకర్మకు మాజీ ఏఎంసీ చైర్మన్ పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు బాసని శంకర్, దుబాసి కృష్ణమూర్తి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## రేపు బాలగోపాల్ 13వ స్మారక ఉపన్యాసం

**వరంగల్ వాయిస్, కేయూ :** మానవ హక్కుల పోరాట యోధుడు, కాకతీయ విశ్వవిద్యాలయ గణిత శాస్త్ర విభాగ విశ్రాంత అధ్యాపకుడు “డాక్టర్.కే.బాలగోపాల్ 13వ స్మారక ఉపన్యాస కార్యక్రమం” విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ సెమినార్ హాల్ లో రేపు ఉదయం 11.00 గంటలకు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత చరిత్ర అధ్యాపకులు, మానవ హక్కుల కార్యకర్త ఎ.చంద్రశేఖర్ “మానవ హక్కులు – ప్రజాస్వామ్యం”పై స్మారక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ అధ్యక్షత వహిస్తారని, విద్యార్థులు, పరిశోధకులు, బోధనేతర, బోధన సిబ్బంది హాజరు కావాలని రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

## ఐటీ మంత్రిని కలిసిన కొంగ శ్రీధర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ కొంగ శ్రీధర్ గురువారం హైదరాబాదులోని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొంగ శ్రీధర్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి మంత్రి శ్రీధర్ బాబుతో నాకు సంబంధాలు ఉన్నాయని వారు తెలిపారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని 1999–2000 పదో తరగతి బ్యాచ్ కు చెందిన తమ తోటి స్నేహితుడు మాచర్ల శ్రీనివాస్ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందగా తోటి స్నేహితులు రూ.38,000లను శ్రీనివాస్ కూతురు నేహా పేరు మీద పోస్టాఫీస్ లో ఫిక్స్డ్ డిపాజిట్ చేసి డిపాజిట్ బాండ్ ను శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందగట్ల సంతోష్, మార్త సుమన్, బాసని రవి, గుండు రాము, మార్త శ్రీనివాస్, బాసాని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సాయిలు



**వరంగల్ వాయిస్, మడికొండ :** కాజీపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తొట్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రమేష్ రాము ఆదేశాల మేరకు మడికొండ గ్రామానికి చెందిన కడమంచి సాయిలును గ్రామ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 46వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ వస్కుల శంకర్, 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, మడికొండ గ్రామ అధ్యక్షులు దువ్వ విజయ్, సీనియర్ నాయకులు పల్లెపు రాజు, బైరపాక వేణు, కడమంచి గోపీచంద్, సిరిపాటి యేసు, జన్ను, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్సై శ్రీకాంత్ జన్మదిన వేడుకలు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఏనుమాముల ఎస్ శ్రీకాంత్ జన్మదిన సందర్భంగా పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ నాయకులు కలసి బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంలో సీఐ మహేందర్ ని ఎస్సై రాజన్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ అడుప మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదాసి భాస్కర్, పెరుమాళ్ల దయాకర్, శిట్టి రంజిత్, నతి లక్ష్మి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

## సీపీని కలిసిన ఎస్ఐ శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను చెన్నారావుపేట ఎస్సై శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నారావుపేట నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలో కాట్ల సోమయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. వారి భౌతికయానికి నెల్లికుదురు మాజీ జడ్పీటీసీ హెచ్ వెంకటేశ్వర్లు గురువారం సందర్శించి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారితో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం అరుణ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కుమ్మరి కుంట్ల మౌనేందర్, కిసాన్ మండల అధ్యక్షుడు సలుగు పూర్ణచందర్, మండల కాంగ్రెస్ నాయకులు హెచ్ మల్లేష్, మైనార్టీ గ్రామ అధ్యక్షుడు ఎస్కే అజ్గార్ అలీ, నాయకులు ఆకుల నరసయ్య, ఎండీ అమీర్ ఖాన్, కాంగ్రెస్ గ్రామ కార్యదర్శి బూర్గుల రజిని కుమార్, షేర్ వెంకట మల్లు, మామిడాల సత్యనారాయణ, బొల్లంపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

# వరంగల్ ఉమ్మడి జిల్లా సాఫ్ట్ బాల్ పోటీలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా సాఫ్ట్ బాల్ అండర్ 14 ఇయర్స్ బాలబాలికల, 17 ఇయర్స్ బాలబాలికల ఎంపిక పోటీలు స్థానిక ఎస్ డీఎల్ సీఈ క్రీడా మైదానంలో గురువారం నిర్వహించారు. ఈ క్రీడలలో వివిధ పాఠశాలల నుంచి 400మంది 14ఏళ్ల, 17ఏళ్ల బాల బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సంగాని మల్లేశ్వర్ పాల్గొని పిల్లలకు మంచి క్రీడా అవకాశాలపై వివరించారు. అనంతరం పిల్లలను అభినందిస్తూ ప్రోత్సహించడం జరిగింది. స్పాట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కావేటి రాజేందర్ పీడీ, ఎస్జీఎఫ్ఐ సెక్రటరీ దాసు నాయక్, పీటీలు కిషన్, పి.రవి ముఖర్జీ, రాజేశ్వర్, సుమలత, స్వప్న, వినయ్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

## ప్రజాస్వామిక వ్యవస్థలో రాజాసింగ్ చీడపురుగు

### కాంగ్రెస్ నేత జంగా రాఘవ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పదేళ్ల అప్రజాస్వామిక, నియంత పాలనకు వ్యతిరేఖంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పును అపహాస్యం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను సవాలు చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ ను ప్రజలే తరిమికొడుతారని కాంగ్రెస్ నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జంగా మాట్లాడుతూ తెలంగాణలో మత చిచ్చు పెట్టడానికే అన్నట్లు పదే పదే పరమత ద్వేషాన్ని చిమ్ముతూ దేశవ్యాప్తంగా ఛీకొట్టబడ్డ వ్యక్తి రాజా సింగ్ కు బుద్ధి రావడం లేదని మండిపడ్డారు. తాజాగా కాంగ్రెస్ నూతన ప్రభుత్వం కూల్చుతామంటూ మాట్లాడడంపై బీజేపీ రాజకీయాలు ఏంటో అర్థమవుతున్నాయన్నారు. వీరి దుర్మార్గపు కుట్రను తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్, మోదీల దుర్మార్గ పాలనలో తెలంగాణ ప్రజలు పదేళ్లుగా పడరాని బాధలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుంట్ల కుటుంబం ఆంధ్ర పెట్టుబడి దారుల కొమ్ము కాచి ఆరు లక్షల కోట్లు అప్పు చేసి అందులో సగం దోచుకున్నదని ఆరోపించారు. కేసీఆర్, అతని కుటుంబం, వారి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారం కోల్పోగానే, అహంకారంతో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రయత్నం చేస్తామని ప్రకటనలు చేయడం ప్రజలు ఇచ్చిన తీర్పును సవాల్ చేయడమేనన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఏ ప్రయత్నం అయినా అశేష తెలంగాణ ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తిప్పికొడతారన్నారు. మరొకసారి 1984లో నాదెండ్లను గద్దె దించినట్లు, దించడంతో పాటు తెలంగాణ ప్రజల కోపాగ్నిలో మాడి కాలగర్భంలో కలిసిపోతారని హెచ్చరించారు. ఇపుడిప్పుడే ప్రజాస్వామిక పాలన వైపు అడుగులు వేస్తున్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం గత ప్రభుత్వ దుర్మార్గాలను, వాటికి బాధ్యులైన వారిని చట్టబద్దంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలే కాపాడుకుంటరని ధీమా వ్యక్తం చేశారు.

## నూతన జిల్లా కమిటీ ఎన్నిక





**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** హనుమకొండ జిల్లా గ్రామ పంచాయితీ కారోబార్, బిల్ కలెక్టర్ల ఉద్యోగుల జిల్లా సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జరిగిన హనుమకొండ జిల్లా గ్రామపంచాయతీ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల సదానందం, రాష్ట్ర కార్యదర్శి వంగా రవీందర్ ఆధ్వర్యలో గ్రామపంచాయతీ కారోబార్ బిల్ కలెక్టర్ల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా తగరం శివ (హసన్ పర్తి), జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి నగేష్(కమలాపూర్), జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గుడెల్లి లక్ష్మణ్ కుమార్ (ఎల్కతుర్తి), జిల్లా ఉపాధ్యక్షుడిగా వెనుకమూరి ఆనంద రావు (పరకాల), జిల్లా కోశాధికారిగా పోరెడ్డి మల్లారెడ్డి (ఆత్మకూరు), జిల్లా కార్యదర్శి నల్ల చిరంజీవి (దామెర), జిల్లా కార్యవర్గ సభ్యులుగా చల్లా మహెందర్ రెడ్డి, నీలం కుమార్, పర్శ భాస్కర్, మ్యాక వెంకటేష్, మేరుగు నిరంజన్ ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు తగరం శివ మాట్లాడుతూ తన తోటి గ్రామపంచాయతీ ఉద్యోగులకు ఏ సమస్య వచ్చిన అండగా ఉండి సమస్యలు పరిష్కరి స్తానని అన్నారు. జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు యజ్ఞ నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కె నాయుడు, రాష్ట్ర కమిటీ సభ్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి

### కేయూ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య




**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ లోని ఫార్మసి కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం కళాశాల ప్రొఫెసర్ సమ్మయ్య ప్రారంభించారు. బొటానికల్ గార్డెన్ యానిమల్ హౌస్ చుట్టు పక్కల ప్రాంతంలో ఉన్న పిచ్చి మొక్కలను, చెత్త, పనికిరాని మొక్కలను శుభ్రం చేసి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంను విజయ వంతం చేశారు. ఇందులో సుమారు 100మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సమ్మయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిసరాల శుభ్రతను చేపట్టి ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఏర్పరుచుకోవాలని ఆయన సూచించారు. ప్రతిరోజు మన దినచర్యలో భాగంగా విద్యార్థులు తమ మేధస్సును పెంపొందించుకోవాలని ప్రొఫెసర్ సమ్మయ్య సూచించారు. మహనీయులైన బుద్ధుడు, మహాత్మాగాంధీ, జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, చంద్రబోస్ ను, భగత్ సింగ్ ల సంకల్పంతో విద్యార్థులు బోధన అంశాలతో పాటు సామాజిక దృక్పథం అలవర్చుకొని సమాజసేవకు పాటుపడాలని అన్నారు. తల్లిదండ్రులకు, కాకతీయ యూనివర్సిటీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. భారతదేశం భవిష్యత్తు విద్యార్థుల క్రమశిక్షణ పైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, డాక్టర్ శశిధర్, డాక్టర్ సుజాత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలికలు అన్ని రంగాలలో ముందుండాలి




**వరంగల్ వాయిస్, మరిపెడ :** బాలికలు అన్ని రంగాలలో ముందుండి రాణించాలని సీడీపీఓ శిరీష అన్నారు. మరిపెడ మండలం ఎల్లంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో అవగాహన కార్యక్రమం స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల హక్కుల కోసం బాలికలు అన్ని రంగాలలో ముందుండి రాణించాలన్నారు. బాలికలు వాళ్లకి ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమ్మాయిలను కూడా అబ్బాయిలతో సమానంగా చూడాలని, పిల్లలు మంచి పోషకాహారం తీసుకొని భవిష్యత్తులో గొప్పగా ఎదగాలని, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా గురించి తెలియజేశారు. హెల్ప్ లైన్ నెంబర్ లు 1098, 181, 100, 1930 ప్రతి ఒక్కరూ సేవ్ చేసుకొని మీకు ఏదైనా అత్యవసర సమయంలో ఈ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రాంలో భాగంగా వారికి బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులపై వ్యాసరచన నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక ప్రధాన ఉపాధ్యాయులు నాగరాజు, ఇతర ఉపాధ్యాయులు, ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, సూపర్ వైజర్ శ్రీలత, మహిళా సాధికారత కేంద్రం స్టాప్ అరుణ, సంధ్యారాణి, రాకేష్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మురుగు కాలువలో మృత శిశువు లభ్యం

### శిశువు మృతిపై విచారణ



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** మురుగు కాలువలో గుర్తుతెలియని మగ శిశువు మృతదేహం లభ్యమైన ఘటన పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గురువారం డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు సమీపంలోని మురుగు కాలువలో తెల్లవారుజామున స్థానికులకు శిశువు మృతదేహం కనిపించింది. వారు పోలీసులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. డీఎంహెచ్ఓ అంబరీష్, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, వైద్య, పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. అప్పుడే పుట్టిన మగ శిశువుగా అధికారులు గుర్తించారు. పోలీసులు అక్కడికి చేరుకొని శిశువు మృతదేహానికి పంచనామా నిర్వహించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మునిసిపాలిటీ వార్డు ఆఫీసర్ కొమ్ము దేవేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంజీ నాయక్ తెలిపారు. కాలువలో ఎవరు మృతదేహాన్ని పడవేశారు, ఏ ఆసుపత్రిలో ఆ శిశువు ప్రసవమైంది, ఎవరూ ప్రసవం చేశారు అనే కోణంలో దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

**శిశువు మృతిపై విచారణ..**

పట్టణంలోని పెద్ద చెరువు సమీపంలో మురుగు కాలువలో అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని వదిలేసిన ఘటనపై వైద్యాధికారులు విచారణ చేపట్టారు. పలు ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి ప్రసవాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. అర్హతలు లేని వారితో వైద్యం చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. జిల్లా వైద్యాధికారి అంబరీష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశమై ఘటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ అంబరీష్ మాట్లాడుతూ గ్రామాల్లో గర్భవతుల వివరాలు సమగ్రంగా సేకరించాలని, ప్రసవాల వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. దానికి అంగన్వాడీ టీచర్లు చొరవ తీసుకోవాలన్నారు. ఆధునిక సమాజంలో భ్రూణ హత్యలు జరగడం సిగ్గుచేటన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాల వివరాలు సక్రమంగా నమోదు చేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్ లపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డాక్టర్ మురళీధర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ ఆరోగ్య కేంద్రం డాక్టర్ మీరజ్, జ్వాలత ప్రియాంక, నందన, సిబ్బంది, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి, సీడీపీఓ హైమావతి, అంగన్వాడి టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బ్రోచర్‌ను ఆవిష్కరించిన కేయూ వీసీ



**వరంగల్ వాయిస్, కేయూ :** ఈనెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా "ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్" ఆధ్వర్యంలో వరంగల్, ఫోర్ట్ రోడ్ లోని రోటరీ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించే సెమినార్ కు వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్ ను గౌరవ అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ వరంగల్ జిల్లా చైర్మన్ శ్రీదేవ సాంబమూర్తి, తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ శ్రీ పాండురంగ విఠల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జగదీశ్వర్ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు.

## మంచాల రమాదేవికి పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంచాల రమాదేవి ఇటీవల బైక్ యాక్సిడెంట్ కు గురై కాలు విరగడం జరిగింది. ఈ నెల 8 నుంచి 10 వరకు పశ్చిమ బెంగాల్ లోని గోరఖ్ పూర్ నగరంలో జరుగు జాతీయ మహాసభలకు బయలుదేరిన సందర్భంగా మార్గమధ్యంలో టూ వీలర్ ప్రమాదంలో కాలు విరిగింది. హనుమకొండలోని అమృత హాస్పిటల్ లో కోలుకుంటున్న రమాదేవిని భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి గురువారం ఆసుపత్రిని సందర్శించి రమాదేవిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె తొందరగా కోలుకోవాలని అన్నారు. అలాగే భారత జాతీయ మహిళా సమైక్య హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు దీన, హనుమకొండ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, గిరిజన సమాఖ్య హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోతు శంకర్, మేస్త్రి సంఘ నాయకులు కుమారస్వామి, రమాదేవిని పరామర్శించారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నూతన ప్రభుత్వం త్వరలోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని, పని చేసే ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలే గుణపాఠం చెప్తారని మాజీ జడ్పీటీసీ జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చంద్రారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్ పటేల్ అన్నారు. గురువారం రఘునాథపల్లి మండలం కోడూరు గ్రామంలో మొన్న జరిగిన ఎన్నికలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామ గ్రామాన వివరిస్తూ లోకసభ ఎన్నికల్లో అభ్యర్థుల విజయం కోసం పని చేస్తామని వారు తెలిపారు వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలు కచ్చితంగా అమలవుతాయని వారు వివరించారు. బలహీన వర్గాల సంక్షేమ లక్ష్యంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, భిక్షపతి నాయక్, అరవింద్ రెడ్డి, నీలం యువరాజు, సట్ల యాకమ్మ, అంజయ్య పాల్గొన్నారు.

## ప్రపంచ బాలోత్సవ్‌లో విద్యార్థి అనుదీప్ ప్రతిభ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రపంచ బాలోత్సవ్ 2023 జానపద నృత్యంలో హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రథమ బహుమతి పొందాడు. గుంటూరు జిల్లా నంబూరులో 11,12,13 తేదీలలో జరిగిన ప్రపంచ బాలల పండగ(బలోత్సవ్)లో జానపథ నృత్యంలో సీనియర్ విభాగంలో జీహెచ్ఎస్ హనుమకొండ పాఠశాల విద్యార్థి బి.అనుదీప్ 8వ తరగతి జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొందినందుకు డీఈఓ అబ్దుల్ హై, జీసీడీఓ రాధ, హెచ్ఎం రమేష్ బాబు, ఉపాధ్యాయులు విద్యార్థి బి.అనుదీప్, ఏ.చరణ్, డాన్స్ మాస్టర్ ఏ.రారాజు(పీటీఐ)లను ఘనంగా సత్కరించారు.

# అంతర్ జిల్లా నేరస్థుడి అరెస్ట్

### 30 కేసుల్లో నిందితుడు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హసన్ పర్తి సీఐ తుమ్మ గోపి ఆధ్వర్యంలో పోలీసులు అంతరాష్ట్ర నేరస్థుడిని గురువారం అరెస్టు చేశారు. సీఐ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన షేక్ ఇర్ఫాన్ (26)తండ్రి యాకూబ్ 2013 నుంచి దొంగతనాలకు అలవాటు పడ్డాడు. గతంలో చాలా సార్లు జైలు జీవితాన్ని అనుభవించారు. ఇతడిని కొన్ని నెలల క్రితం పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. ఇటీవల జైల్ నుంచి విడుదలైన నిందితుడు తన ప్రవృత్తిని మార్చుకోకుండా ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతూ, ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ఇండ్లలో దొంగతనం చేసి తొమ్మిది వేల రూపాయలతో పాటు ఒక చంద్రహారాన్ని ఎత్తుకెళ్లాడు. ఈ చోరీలు మతిన్ అనే స్నేహితుడితో కలిసి చేసేవాడు. అక్టోబర్ నెలలో ఆరు తులాల బంగారం, 15 తులాల వెండి దొంగతనం చేసి కొత్తగూడెం జిల్లా పరిధిలోని గుర్తుతెలియని వ్యక్తికి అమ్మి, వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఇదే విధంగా కొత్తగూడెం జిల్లాలో చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3, వరంగల్ కమిషనరేట్ పరిధిలోని మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2.5 తులాల బంగారం కమ్మలు, చైను, 20తులాల వెండి, రూ.20వేల నగదును దొంగతనం చేసి మతిన్ అనే నేరస్తుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ప్రస్తుతం అతను కారాగారంలో ఉండటంతో వీరిద్దరి మధ్యల దొంగిలించిన సొత్తు గురించి గోడవపడి విడిపోయారు. అనంతరం ఇతడు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక ఆటో దొంగతనం చేయడానికి ప్రయత్నించిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. బావుపేట క్రాస్ రోడ్ వద్ద హసన్‌పర్తి పోలీసు వాహనాల తనఖీ చేయు క్రమంలో ఈ నేరస్తుడిని పట్టుకొని విచారించడంతో ఇంతకు ముందు చేసిన నేరాల గురించి చెప్పడం జరిగింది. అతన్ని పట్టుకున్నప్పుడు అతని జేబులో రెండున్నర తులాల బంగారు చంద్రహారం దొరికింది. ఇది ఇల్లందులో తాను దొంగిలించిన సొమ్ముగా అతడు పేర్కొన్నాడు, నేరస్తుడు మొత్తం 30 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. ఈ నిందితుడిని పట్టుకోవడంలో సెంట్రల్ జోన్ డీసీపీ ఎండీ భారీ, క్రైమ్ డీసీపీ పి.మురళీధర్, కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ ఆదేశాల మేరకు హసన్‌పర్తి ఇన్ స్పెక్టర్ తుమ్మ గోపి, క్రైమ్ కానిస్టేబుల్ వి.క్రాంతి కుమార్, నాగరాజు, మధు, సోమన్న, గీత సంఘటన స్థలానికి వెళ్లి అతడిని చాకచక్యంగా పట్టుకున్న వారిని వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రత్యేకంగా అభినందించారు.

# దివ్యాంగులు స్ఫూర్తి ప్రదాతలు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**వరంగల్ వాయిస్, ములుగు :** సమాజంలో దివ్యాంగులు సాధారణ పౌరులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల ఆవరణంలో మహిళా, శిశు , దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని అవయవాలు సక్రమంగా పనిచేసే వ్యక్తులు విజయాలను సాధిస్తే, ప్రతికూలతలను అధిగమిస్తూ అసమాన విజయాలను సాధించే దివ్యాంగులు ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని అన్నారు. దివ్యాంగుల తల్లి తండ్రుల కన్నా టీచర్లు, గార్డియన్లు పిల్లలకు తోడుగా నిలిచి వారికి సకాలంలో సరైన ప్రోత్సహాన్ని అందిస్తు ముందుకు నడిపిస్తున్న వారందరిని కలెక్టర్ అభినందించారు. జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొన్న వారందరూ రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుతమైన విజయాలను సాధించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. తదనంతరం దివ్యాంగులతో కలసి చెస్ పోటీలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాస్థాయి దివ్యాంగుల ఆటల పోటీలలో శారీరక వైకల్య సమస్యలను అధిగమించి ఉత్సాహంగా పాల్గొంటున్న వారి ఆటతీరును వారి ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డీఎంహెచ్ ఓ అప్పయ్య, డీఈఓ పాణిని, దివ్యాంగుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బండ్ సుందరీకరణకు ఎందుకు ఆలస్యం

### గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా

### జనవరిలోగా పూర్తి చేయాలంటూ ఆదేశం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ లో పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా త్వరితగతిన పూర్తి చేయుటకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన భద్రకాళి చెరువుపై స్మార్ట్ సిటీ పథకం కింద రూ. 70కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న బండ్ సుందరీకరణ పనులను పురోగతి పరిశీలించి పాత్ వే, సైకిల్ ట్రాక్, గజిబో గ్రీనరీ తదితర పనులను వచ్చే జనవరి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పోతన రోడ్ ఆజార హాస్పిటల్ వద్ద నిర్మిస్తున్న డ్రైన్ పనులను కమిషనర్ పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. నయీం నగర్ ప్రధాన రహదారిపై నిర్మించనున్న కల్వర్టు నిర్మాణాన్ని నేషనల్ హైవే అధికారుల సమన్వయంతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జవహర్ నగర్ లో రూ.3కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నగర్ బ్రిడ్జి పనుల పురోగతిని కూడా ఈ సందర్భంగా కమిషనర్ పరిశీలించి పనుల్లో వేగం పెంచాలన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, హెచ్ఓ రమేష్, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, సంజయ్ కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్ బాబు, ఏఈలు కార్తీక్ రెడ్డి, హరికుమార్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులను కలిసిన ఎమ్మెల్యే జీఎస్సార్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సచివాలయంలోని తమ తమ చాంబర్లలో పలువురు మంత్రులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల మంత్రి సీతక్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలను మర్యాదపూర్వకంగా కలిసి, వారికి పూల బొకేలు ఇచ్చి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐత ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజర్ల అశోక్, ఇస్లావత్ దేవన్, పిప్పాల రాజేందర్, మాచర్ల సంతోష్ తదితరులు ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com